క్లుప్తంగా

సైన్స్ క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, కరస్పాండెంట్ ప్రవీణ్

తల్లాడ: ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్ నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా సైన్స్ క్విజ్ పోటీల్లో తల్లాడ బాలభారతి విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చి నాలుగో స్థానం సాధించారు. 75 పాఠశాలల నుంచి 250మంది విద్యార్థులు పోటీ పడిన సైన్స్ క్విజ్‌లో పదోతరగతి విద్యార్థిని లక్ష్మీ శ్రీజా, తొమ్మిదో తరగతికి చెందిన ఉజ్వల 4వ స్థానం సాధించారు. సత్తా చాటిన బాలభారతి విద్యాలయం విద్యార్థులను ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఏఓ యాచమనేని శశాంక్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురంలో ఖమ్మం జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు బీపీ, షుగర్, కంటి, స్త్రీ, ప్రసూతి వైద్య సేవలు అందించారు. సువర్ణాపురం గ్రామంతో పాటు, పరిసరప్రాంతం గ్రామాల నుంచి వచ్చిన దాదాపు 300మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాటిబండ్ల సుదర్శన్ రావు, ఎస్ సాధన్ సిద్దార్థ్, కృష్ణసాగర్‌రెడ్డి, పారా రేణుక, జాబిశెట్టి గౌతమ్, అశ్విన్ సిద్దార్థ్, పారుపల్లి నిషాంత్, జంగాల శ్రవంతి, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభను..

మధిర: ఈ నెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ వినోద్ రావు తెలిపారు. ఆదివారం మధిరలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వీరయ్య, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, కోశాధికారి చెన్నయ్య, కార్యదర్శులు భాస్కర్‌రావు, లాల్, అహ్మద్, రాజు, రమేష్, రమేష్‌బాబు, రఫి, మహేంద్ర కుమార్, కృష్ణ, ఆంజనేయులు, సైదారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముళ్లు



మాలధారులను సన్మానిస్తున్న స్థానిక పెద్దలు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం, లింగగూడెం గ్రామాల్లో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 40 రోజుల పాటు మాలధారణ చేసి నిష్టగా పూజలు చేసిన అయ్యప్ప మాలధారులు ఇరుముడి కట్టుకుని శబరిమలైకు బయలు దేరి వెళ్లారు. బస్వాపురంలోని కనక దుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన ఇరుముడి కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, తూము అప్పారావు, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు ఆర్థిక సాయం



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కల్లూరు: జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు వుయ్యూరి శ్రీవ్యాల్ ఆదివారం రూ.25 వేలు అందజేశారు. అయోధ్యలో జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన క్రీడాకారుల భోజనం, అల్పాహారం కోసం నగదు అందజేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీవ్యాల్‌కు ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య, కోచ్ శ్రీదేవి, మేనేజర్ రాధాకృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి

మధిర: మధిర ట్యాంక్ బండ్‌పై ఆదివారం మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

బాగు చేయరూ..

గుర్రపు డెక్కతో మూసుకుపోతున్న సాగర్ కాల్వలు





లక్ష్మీనగర్ గ్రామం వద్ద గుర్రపు డెక్క, వ్యర్థాలతో మూసుకుపోయిన సిరిపురం మేజర్ కాలువ

తల్లాడ: గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాల్వలు మూసుకు పోతున్నాయి. నాగార్జున సాగర్ జలాశయంలో సమృద్ధిగా నీరుండి ఈ ఏడాది రెండు పంటలకు నీరందిస్తామని అధికారులు ప్రకటించారు. ఖరీఫ్ ముగిసి రబీకీ సిద్ధమౌతున్న తరుణంలో కాల్వల నిండా గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. అంతే కాకుండా కాల్వల్లో పై నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు కొట్టుకొచ్చి సిరిపురం మేజరులో లక్ష్మీనగర్, మల్లవరం సమీపంలో ఆగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు..

గుర్రపు డెక్క కాలువలో తీగలాగ అల్లుకు పోయి నీటి సరఫరాకు ఆటంకంగా మారగా దానికి తోడు పై నుంచి వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువ మూసుకుపోతుంది. ఇంత జరుగుతున్నా ఎన్ఎస్‌పీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తల్లాడ మండలంలో 24వేల ఎకరాలు సాగర్ కాల్వల కింద మాగాణి ఆయకట్టు భూమి ఉంది. దీంతో పాటు మెట్ట పంటలైన పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు కూడా వేలాది ఎకరాల్లో ఉన్నాయి. ఈ పంటలన్నింటికీ సాగు నీటిని సరఫరా చేయాలంటే కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శుభ్రం చేయాల్సి ఉంది. ఎన్ఎస్‌పీ సిబ్బంది కొరతతో కాల్వలను అలాగే వదిలేస్తున్నారు. కాల్వల పరిస్థితిపై ఆదివారం 'సాక్షి' విజిట్‌లో ఈ దృశ్యాలు కనిపించాయి. ఫలితంగా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రబీ సీజన్ వరి సాగుకు వారబందీ ద్వారా నీరిస్తామని ఎన్ఎస్‌పీ అధికారులు ప్రకటించటంతో కాల్వలు ఇలాగే ఉంటే నీటి ఎద్దడి తీవ్రంగా ఉండొచ్చు.

ఘనంగా దధిమథన మహోత్సవం



రేజర్ల రామాలయంలో దధిమథనం చేస్తున్న అర్చకులు, భక్తులు

సత్తుపల్లిరూరల్: రేజర్లలలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాసం మహోత్సవాల సందర్భంగా ఆదివారం ప్రముఖ ప్రవచన కర్త శ్రీమాన్ నల్లాన్‌చక్రవర్తుల రామకృష్ణమాచార్యస్వామి ఆధ్వర్యాన దధిమథన(మజ్జిగ చిలుకు కార్యక్రమం) మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడో రోజు ధనుర్మాసం పాశురం సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఆనాడు క్షీరసాగర మథనం ఎంత కష్టమో గోపికలు శ్రీకృష్ణుడి కోసం పెరుగును చిలకటం కూడా అలాగే ఉండేదని వివరించారు. కృష్ణుడి అనుగ్రహంతో పాడి అంత సమృద్ధిగా లభించేందని పేర్కొన్నారు. ఈ వ్రతం ఎక్కడ జరుగుతుందో అక్కడ పాడిపంటలకు, ఆయూఆరోగ్యాలకు లోటు ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో మంజుభాషిని, ఒగ్గు పుష్పావతి, నాగేంద్రమ్మ, లక్ష్మి, సావిత్రి, ప్రేమలత, మాధవి, కాసర్ల సావిత్రి, ఉమామహేశ్వరి, శ్రీను, రామారావు, భక్తులు పాల్గొన్నారు.

రైతు ధర్నాకు తరలిరావాలి



వైరారూరల్: మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరారూరల్/కొణిజర్ల: రైతు సమస్యలపై ఈ నెల 23న ఖమ్మంలోని కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్ల మండలంలోని చిన్నగోపతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. వైరా మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినహాయింపు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, యనమద్ది రామకృష్ణ, తోట నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాజేంద్ర, రాజేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్న దానయ్య, గోపయ్య, యోహాన్, వీరభద్రం, కొండయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సత్యహరిశ్చంద్ర పద్య పోటీలు



పద్య పోటీలను నిర్వహిస్తున్న సుమిత్రా యూత్ సభ్యులు

మధిర: మధిర ప్రాంత కళారంగ వైభవాన్ని కొనసాగించడానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నిరంతరం కృషి చేస్తున్నారని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ తెలిపారు. టీవీఎం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సత్య హరిశ్చంద్ర పద్య పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సుమిత్రా యూత్ అధ్యక్షులు పబ్బతి రాంబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, కేశవదాసు, కళాపరిషత్ అధ్యక్షుడు కొండపల్లి జగన్మోహన్‌రావు, సభ్యులు రాజేందర్, కిషోర్‌రెడ్డి, బుచ్చిరామయ్య, చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రవికుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పద్య పోటీల్లో భరత్ విద్యార్థుల ప్రతిభ..



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సుమిత్ర యూత్ సభ్యులు

మధిర: మధిర పట్టణంలోని టీవీఎం ప్రభుత్వ పాఠశాలలో సుమిత్ర యూత్ ఆధ్వర్యంలో రెండు మండలాల స్థాయిలో ఆదివారం నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పద్య పోటీల్లో భరత్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో తపస్వి, జాహ్నవి, సబ్ జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానంలో అన్విత విజ యం సాధించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకట రెడ్డి, విద్యాలత విద్యార్థులను అభినందించారు.

ఐఎన్‌టీయూసీ వైరా డివిజన్ సమావేశం



మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

మధిర: మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్‌లో విద్యుత్ శాఖ వైరా డివిజన్ 327 యూనియన్ ఐఎన్‌టీయూసీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదె నర్సింహారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి హుస్సేన్, కర్నాటి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గాదె మోహన్ రెడ్డి, శ్రీనివాసరావు, టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, రీజనల్ సెక్రటరి సీతారాం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ రావు వర్ధంతి



తల్లాడలో పీవీ రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు

కారేపల్లి/తల్లాడ: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యాన కారేపల్లిలో ఆయన చిత్రపటానికి, తల్లాడలోని కల్లూరురోడ్‌లో ఉన్న పీవీరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దామవరపు నరసింహారావు మాట్లాడుతూ.. మాలల హక్కుల కోసం తన తుదిశ్వాస వరకు పోరాడిన పీవీ రావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి బాలషౌరీ, కొండా జాన్, కందుల నారాయణ, వేము అశోక్, స్లీవరాజు, కారేపల్లి మండల అధ్యక్షుడు రాములు, చంద్రప్రకాశ్, యుగేందర్, శ్రీరాములు, నాగరాజు, టోనీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వైరా: వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో ఆదివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకుని రామానుజన్ నంబర్ 1729 ఆకారంలో విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ డాక్టర్ పి.భూమేష్, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ.. రామనుజన్ నంబర్ ప్రాధాన్యత, గణితంలో ఆయన కనిపెట్టిన ఆవిష్కరణలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న సీపీఐ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

చింతకాని: ఈ నెల 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నాగిలిగొండ గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా భారీ ప్రదర్శన, రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని గ్రామాల్లో పార్టీ జెండావిష్కరణతో పాటు పార్టీ గత చరిత్ర, పార్టీ సాధించిన పోరాట విజయాలను నేటి తరాలకు తెలియజేయాలన్నారు. ఈ ఆవిర్భావ వేడుకలకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు అరికొట్ల భాస్కర్, దమ్మాలపాటి శ్రీనివాస్, శేఖర్, ఏలియా, బాబు, ఏపూరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.80 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైరా నియోజకవర్గ వ్యాప్తంగా రూ.కోట్లలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. త్వరలో అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఆయా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డె నారాయణరావు, స్వర్ణ నరేందర్, తేళ్లూరి చంద్ర ప్రకాశ్, మంగీలాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లికి బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

కల్లూరురూరల్: కల్లూరు ఎన్ఎస్పీ క్రాస్‌రోడ్‌లో గల శ్రీశ్రీశ్రీమారెమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి గణపతి హోమాన్ని నిర్వహించారు. శ్రీశ్రీశ్రీమారెమ్మ తల్లి ఆలయ వ్యవస్థాపకులు మేచర్ల నాగమల్లేశ్వరరావు, మాణిక్యమ్మతో పాటు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మేచర్ల రాధాతో పాటు పలువురు భక్తులు లక్ష్మి గణపతి హోమంలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకొని పంచామృతాభిషేకం, శ్రీగణపతి పూజ కార్యక్రమంతో పాటు అమ్మవారిని ఊరేగించారు. అనంతరం అమ్మవారికి దేవాలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



కుట్టు మిషన్ అందజేస్తున్న గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ పెద్దలు

వైరా: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఉండ్రు వరలక్ష్మిల ఆర్థిక సాయంతో నిత్యావసరాలు అందజేశారు. వైరాకు చెందిన మోదుగు రత్నకుమారి, రాజేశ్వరి అనే మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అజీమ్ అనే యువకుడికి వైద్య పరీక్షల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, లగడపాటి ప్రభాకర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, డాక్టర్ డి కోటయ్య, డాక్టర్ రవిచంద్ర, కిషన్, పుల్లారావు, రామకృష్ణ, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్ గణేష్ మృతికి నివాళి

సత్తుపల్లిటౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సత్తుపల్లి మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్ తోట గణేష్ మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గణేష మృతదేహానికి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ మందా రవిబాబు, ఉద్యోగులు నివాళులర్పించారు. అదే విధంగా సొసైటీ ఉపాధ్యక్షులు గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, గంద్ర సారధిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం గణేష్ మృతదేహాన్ని అతని స్వగ్రామం మర్లపాడుకు తరలించగా అంత్యక్రియలు నిర్వహించారు.

టీడీపీలో చేరిన మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్



బీజేపీ నుంచి టీడీపీలోకి చేరిన భద్రరాజు

తల్లాడ: తల్లాడలో ఆదివారం టీడీపీ రాష్ట్ర నాయకుడు కేతినేని హరీష్, టీడీపీ మండల నాయకుల సమక్షంలో వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బీజేపీ నాయకులు దూపాటి భద్రరాజు టీడీపీలో చేరారు. టీడీపీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా భద్రరాజుకు టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గతంలో భద్రరాజు టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కూచిపూడి వెంకటేశ్వర్లు, సరికొండ శ్రీనువాస రాజు, దగ్గుల శివారెడ్డి, పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి నివాళి

సత్తుపల్లి: ఇటీవల మృతి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గాదె ఉమామహేశ్వరరావు చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, రామిశెట్టి సుబ్బారావు, సాంబశివరెడ్డి, ప్రకాశరావు, బోడెపూడి బాబు, వెంకట్రామిరెడ్డి, రమణ, కృష్ణయ్య, నారాయణరెడ్డి, బి.మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



మధిర: ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు



సత్తుపల్లిలో..



వైరా: అఖిలపక్షం ఆధ్వర్యంలో..

మధిర: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్, సీపీఎం మధిర నియోజకవర్గ కార్యదర్శి గోపాలరావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రవిబాబు, సీపీఎం, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: మండలంలోని సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు జానికీరాములు, కృష్ణమూర్తి, ఉపేందర్, అప్పారావు, రమణ, కోటేశ్వరరావు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైరా–జగ్గయ్యపేట రోడ్డులో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శులు కిలారు సురేష్, యంగల ఆనంద్ రావులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరావు, కోటేశ్వరారవు, శ్రీను, వీరబాబు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని అఖిలపక్షాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సింరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండ బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భద్రయ్య, నాగేశ్వరరావు, రాజు, సతీష్, కల్యాణ్, దర్మయ్య, లక్ష్మయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో అఖిపక్షం ఆధ్వర్యాన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ర్యాలీ చేశారు. అనంతరం రింగ్‌సెంటర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, ఆనంద్, చెన్నారావు, కమల్‌పాషా, ఆదినారాయణ, సామేలు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి ప్రదర్శనగా కొత్తగూడెం రోడ్డు, కల్లూరు రోడ్డు వరకు వెళ్లారు. అక్కడ నుంచి బస్టాండ్ సెంటర్‌కు చేరుకొని అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కిరణ్‌కుమార్, జమాల్, వెంకటేశ్వరరావు, బుచ్చిబాబు, సైదులు, సత్తెనపల్లి నరేష్, రవీంద్ర, చల్లా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైరా: వైరాలో అఖిల పక్షం ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు సెంటర్లో దిష్టిబొమ్మ దగ్ధం చేసి అమిత్‌షాను తక్షణమే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, సుధాకర్, అర్జునరావు, వెంకటనర్సిరెడ్డి, బాబు పాల్గొన్నారు.

కొణిజర్ల: కొణిజర్లలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా బాబు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తండు సోమయ్య, గొడ్డుగొర్ల శ్రీను, ఎస్‌కే రజాక్, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: అమిత్‌షా వ్యాఖ్యలపై ఏన్కూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు జాగర్లమూడి రంజిత్‌కుమార్, స్వర్ణ నరేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.